# అందని చదువు

## నౌషాద్ ఖాన్

**రాత్రి పడిన వర్షపు జల్లు కారణంగా నేలంతా కళాపు చల్లినట్లు మెత్తగా వుంది. సూర్య కిరణాలు నెమ్మది నెమ్మదిగా తీక్షణ మవుతున్నాయి.**

అది భద్రాచలానికి యాభై కిలోమీటర్ల దూరంలో వున్న తలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్ ఏజన్సీ ప్రాంతం.

రిజర్వాయర్ నిండిపోయిన కారణంగా ఆనకట్ట పైనుంచి తేటనీరు చిన్నపాటి జలపాతంలా హుందాగా ప్రవహిస్తూ గోదావరిలో కలిసిపోతోంది.

ఆ ప్రాజెక్టుకు ఓవైపు ఇంద్రప్రస్థంలా మెరిసిపోతోంది ఇంజనీర్స్ కాలనీ. మరోవైపు ఇంజనీర్ల పిల్లలు చదువుకోవడానికి మమ్మీ, డాడీ సంస్కృతిని పెంచే కాన్వెంట్ కట్టించాడు ఓ వ్యాపారవేత్త. సామాన్యుడి నెలాదాయంతో సమానంగా వుండే ఫీజులతో అన్ని రకాల హంగులతో విజయవంతంగా నడపబడుతోంది ఆ కాన్వెంట్.

ఆ రెంటికి మధ్య ఇరుగ్గా అస్తవ్యస్తంగా నాగరిక సమాజానికి దూరంగా విసిరేసినట్లు వున్నాయి ఓ పదిహేను గుడిసెలు. అవి పెద్ద పెద్ద గుట్టలను సైతం కంకర గా చేసే కూలీలవి.

చేతిలో ఎర్రరంగు చొక్కాతో సత్తు పలకతో గుడిసెల్లో వున్న తన ఇంటివైపు స్పిల్‌వే మీదుగా నడుచుకుంటూ వస్తున్న రాజమ్మ కళ్ళలో మరణించిన భర్త రూపం మసక మసగ్గా కదలాడుతూ ఆమె గుండెను పిండి చేస్తోంది.

ఆమె భర్త సమ్మయ్య ఆ ఏజెన్సీ ప్రాంతానికి ప్రాజెక్ట్ సర్వే మొదలైనపుడే భార్యతో అక్కడికి వలస వచ్చాడు. ఆ ప్రాజెక్ట్ పునాదుల నుంచి పిల్ల కాలువల కాంక్రీటు వర్కు వరకు యంత్రంలా పనిచేస్తూ వచ్చాడు సమ్మయ్య. ఓ దుర్ముహూర్తాన ప్రాజెక్ట్ దగ్గర పనిచేస్తూ పిడుగు పడి మరణించాడు.

అతనితోపాటు పిడుగుపాటుకు మరణించిన ఓ. జూనియర్ ఇంజనీరుగారి కుటుంబానికి ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ ఫండ్, ఇన్సూరెన్స్ రూపాలలో డబ్బు లభించింది. కాని రాజమ్మకు తన భర్త చేసిన ఆ నెల కూలీ రెండు వందలు కూడా పూర్తిగా చేతి కందలేదు.

అప్పటికి రెండేళ్ళ వయసులో వున్న బిక్షంలో సమ్మయ్యను చూసుకుంటూ గత అయిదేళ్ళుగా జనారణ్యవాసం చేస్తున్నది రాజమ్మ.

ఇంటి ముందు కూర్చుని అప్పటివరకు స్కూలుకు సుకుమారంగా నడుచుకుంటూ వెళ్తున్న ఉద్యోగస్తుల పిల్లలను ముచ్చటగా చూస్తున్న బిక్షం కళ్ళు తల్లిచేతిలో పలకను చూడగానే విజయగర్వంతో మెరిశాయి.

ఎదురుగా పరుగెత్తుకువచ్చిన బిక్షంలో అమృతం మింగినంత ఆనందం చూడగానే ఆమె కళ్ళలో నీటి తెరలు మటుమాయమైపోయాయి. ఎత్తుకుని ముద్దుల వర్షం కురిపించింది.

సరిగ్గా రెండ్రోజుల క్రితం,

"అమ్మా, ఆ కోటర్సులో వుండే ఆపీసర్లంతా సిన్నప్పుడు ఏ పనికి పోయేవాల్లు" అంటూ అమాయకంగా అడిగిన కొడుక్కి "చిన్నప్పుడు వాల్లంతా బల్లె బాగ సదూకుని గింత పెద్దాపీసర్లయిన్రు" అంటూ సమాధానమిచ్చింది.

అప్పటినుంచి తనూ స్కూలు కెళ్తానని మారాం చేయసాగాడు బిక్షం.

పది కిలోమీటర్ల లోపు ఎక్కడా గవర్నమెంటు స్కూలు లేదు, ఆ ప్రయివేట్ స్కూల్లో చదివించడానికి తనకు అంతస్తు చాలనందుకు వారించబోయి కొట్టింది.

అయినా వినక పట్టు వదలని బిక్షం, రాత్రి నుంచి! భోజనం చేయకుండా సత్యాగ్రహం చేస్తున్న బిక్షం నయనద్వయంలో కొండంత దిగులు చూడలేక తను పనిచేసే ఇంజనీర్ గారింటికి వెళ్ళింది.

ఓ సత్తు పలక, ఎర్ర చొక్కా పట్టుకొచ్చింది, ఆ కాన్వెంట్‌లో పరిస్థితులకు రేపు మనసు మార్చుకుంటాడనే ఉద్దేశంతో.

కొడుకుని ఎత్తుకుని బుజ్జగిస్తూ "ఒరే అయ్యా! గాబల్లె మన బోటోల్లు సదూకోలేంరా. ఆయిగా యింజనీరుగారింట్ల పనికిజేర్తే నెలకి నూటయాబయిత్తనంది. నూ సెయ్యాల్సిందల్ల గాల్ల సిన్న పోరన్ని ఏడిసినప్పుడు ఎత్తుకోడం, బోర్ల సరుకులు తేడం, బట్ట లుతకడం"

ఆమె మాటలు పూర్తి అవకముందే

"నే చేరనే, బల్లెకు బోయి పెద్ద యింజనీరయిత, బోల్డు పైకమొత్తది గదంతా నీకే యిత్తలే" అంటూ వేదాంతిలా చెబుతున్న బిక్షానికి సమాజంలో తన స్థానం ఏమిటో, ఎలా తెలియచెప్పాలో అర్థం కాక గుండెలకు హత్తుకుని కళ్ళనీళ్ళు చెంగుతో తుడుచుకుంది.

బిక్షం గబగబా వళ్ళోంచి దిగి చంకల దగ్గర చిరిగివున్న ఎర్రచొక్కాకు రెండు కుట్లు వేసుకుని, వంటిమీద వున్న నల్ల నిక్కరుమీద అది తొడుక్కున్నాడు.

ఆ చొక్కా సరిగ్గా నడుముల వరకు కూడా లేనందున శరీరం కనిపిస్తుంటే గట్టిగా క్రిందికి లాక్కుని సర్దుకున్నాడు.

అప్పటికే పిల్లలందరూ వెళ్ళిపోవడంతో తల కూడా దువ్వుకోవడం మరిచి పలక పట్టుకుని స్కూలువైపు పరు గెత్తాడు. పది నిమిషాలు పరుగెత్తిన తరువాత గేటు దాటి లోపలికి వెళ్ళబోతున్నాడు బిక్షం.

"ఏయ్, కుర్రోడా ఎక్కడికి" యమకింకరుడిలా గర్జించాడు గేట్‌కీపర్.

"నేను బల్లె సేర్తన్న" నీళ్ళు నములుతూ చెప్పాడు బిక్షం.

"మొహం చూడు చెధవ మొహం, బళ్ళో చేరతాడట, నీలాంటివాళ్ళంతా ఈ బళ్ళో చేరితే దీని పరువు మంటగలిసినట్లే! వెళ్ళెళ్ళు" అంటూ చేయి పట్టుకుని వెనక్కి లాగాడు.

బిక్షం మనసు చివుక్కుమంది. బిక్కవచ్చిన మొహంతో ఇంటికి వెళ్ళడం ఇష్టంలేని బిక్షం, గేట్‌కీపర్‌కు కాస్త దూరంగా వెళ్ళి అక్కడినుంచి గోడ దూకి గ్రౌండ్‌లోకి దిగి గీరుకుపోయిన మోచేతిని తడుముకుంటూ ఒకటవ తరగతి రూమ్‌వైపు నడుస్తున్నాడు.

కొద్ది దూరం నడిచిన తరువాత "ఒరేయ్" అన్న కంఠం విని ఉలిక్కిపడ్డాడు బిక్షం. బుర్ర మీసాలతో భయంకరంగా, రౌద్రంగా చూస్తూ వచ్చి తన చెవి పట్టుకుంటుంటే వళ్ళంతా కంపించిపోయింది బిక్షానికి.

"ఏమిరా, స్కూలుకు యూనిఫాం వేసుకుని రావాలని తెలియదూ ఏమిటా చెధవ అవతారం" అంటూ అడిగాడు హెడ్‌మాస్టరైన ఆ ఆజానుబాహుడు.

"రేపు... కుట్టించుకువస్తానండి" భయకంపితుడవుతూ నసిగాడు బిక్షం.

"ఊ... చేయి పట్టు" అంటూ తేనె బెత్తంతో నాలుగు దెబ్బలు కొట్టి "రేపు ఇలాగే వచ్చావంటే చీరేస్తాను జాగ్రత్త" అంటూ బెదిరించి వెళ్ళిపోయాడు.

చదువు వంటపట్టించుకుందామని ఆశగా పరుగెత్తుకు వచ్చిన బిక్షానికి అన్నీ ఆటంకాలే కలగడంతో మనసు వికలమవుతోంది.

సెకెండ్ బెల్ మోగినా మాస్టరు ఇంకా క్లాస్‌కు రానందున పిల్లలందరూ గోల చేస్తున్నారు.

బిత్తర చూపులు చూస్తూ వచ్చి మొదటి బెంచీలో ఓ మూలగా కూర్చున్నాడు బిక్షం అమాయకంగా.

అతని చిరిగిన బట్టలు, మాసిన తల చూసి ఆ బెంచీలో కూర్చున్న ఇంజనీర్ల పిల్లలు ముక్కు మూసుకుంటూ వెనుక బెంచీలోకి వెళ్ళి కూర్చున్నారు.

"ఏయ్, పిలగా స్నానం చేసి, పౌడరేసుకుని, ఇస్త్రీ చేసిన యూనిఫాం వేసుకుని రావాలని తెలీదు" అడిగాడు ఓ విద్యార్థి.

"కాళ్ళకు షూ వేసుకుని రాలేదేం, ఎబ్బే! బురద కాళ్ళు మాస్టారు చూశారంటే ఎండలో నించోబెడతారు" చెప్పాడు మరో విద్యార్థి.

వాళ్ళ ప్రశ్నలకు నీటిలోంచి తీసి ఒడ్డుమీద విసిరేసిన చేపపిల్లలా విలవిల్లాడిపోయింది బిక్షం మనసు. తన

నిర్భాగ్యాన్ని వాళ్ళంతా ఎత్తిపొడుస్తుంటే, ఆ చిన్నారి మనసులో దుఃఖం పొంగుతుంటే నిలదొక్కుకోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.

థర్డ్ బెల్ మోగడంతో మేస్టారు వచ్చి చైర్ మీద కూర్చున్నాడు.

ఎర్రగా, సుకుమారంగా, బొద్దుగా వున్న ఉద్యోగస్తుల పిల్లల ముందు నల్లగా, సీలగా, విచారంగా కూర్చుని వున్న భిక్షం వైపు అదోలా చూసి దృష్టి మరల్చి అటెండరు తెచ్చిన నోటీసు చదవడం మొదలు పెట్టాడు.

"స్పెషల్ ఫీజు నూటయాభై రూపాయలు తేని వాళ్ళు లేచి నుల్చోండి" తల ఎత్తుతూ బిగ్గరగా అన్నాడు మాస్టారు.

బిక్కు బిక్కుమంటూ లేచి నిల్చున్నాడు భిక్షం. భిక్షంతోపాటు వెనుక బెంచిలో నిల్చున్నాడు మరో విద్యార్థి.

"నువ్వు జూనియర్ ఇంజనీర్ సత్యానంద్‌గారి అబ్బాయివి కదూ" నవ్వుతూ అడిగాడు మాస్టారు ఆ విద్యార్థిని.

అవునన్నట్టు తలూపాడతను.

"మీ అటెండర్‌తో ఫీజు పంపమని మీ నాన్నగారికి చెప్పు, కూర్చో" నవ్వుతూ అన్నాడు మాస్టారు.

అతను ఆనందంగా కూర్చున్న తరువాత భిక్షంవైపు తలతిప్పాడు మాస్టారు.

"నీ పేరు" అడిగాడు మాస్టారు.

"భిక్షం"

"ఎప్పుడు చేరావ్" మళ్ళీ అడిగారు మాస్టారు.

"ఇయ్యాలే సేరానండి" భిక్షం జవాబు.

"ఎంట్రెన్స్ ఫీజు రెండు వందలు కట్టావా?"

"లేదండి."

"ఫీజు కట్టకుండా స్కూలుకెందు కొచ్చావ్, ఏమిటా అవతారం! కనీసం యూనిఫారమైనా వేసుకు రాలేదేం" గదమాయించారు మాస్టారు.

"ఊ! బయట నుంచో" కోపంగా అన్నారు మాస్టారు.

భిక్షం బెదురుచూపులు చూస్తూ క్లాస్ బయటకి వచ్చి ఎండలో నిల్చున్నాడు.

ఓ అర్థగంట గడిచిపోయింది. మాస్టారు నిర్విఘ్నంగా పాఠం చెబుతున్నారు. తనలాంటి వాళ్ళు ఈ కాన్వెంట్‌లో చదువుకోవడం అసంభవమని తెలుసు కుంటుంటే అతని కళ్ళు తిరిగిపోతున్నాయి.

అతని కళ్ళు ఉన్నట్టుండి తేలిపోతున్నట్లనిపించింది. ఎండ తీవ్రంగా వుండడంతో కళ్ళు బైర్లు కమ్ము తున్నాయి అతనికి. ఈ సమాజం అతన్ని లోయల్లోకి నెట్టేస్తున్నట్లు అనుభూతి, కాళ్ళు తేలిపోతున్నట్లు అని పిస్తుంది. ఉన్నట్లుండి మాస్టారికి జాలేసినట్లుంది లోపలికి రమ్మన్నాడు.

"మీ నాన్న ఏం చేస్తుంటాడు" అడిగాడు మాస్టారు.

"లేడండి, చనిపోయిండు, మా అమ్మ ఇంజనీరుగారింట్లో పాచి పని చేత్తదండి" సమాధానమిచ్చాడు.

"మీ అమ్మ సంవత్సరాదాయం మొత్తం కలిపినా ఇక్కడ ఫీజులు కట్టడానికి సరిపోవు. రేపట్నుంచి ఈ



స్కూలుకు రాకు. భద్రాచలంలో మీలాంటివాళ్ళకు గవర్నమెంటు స్కూలుంది అక్కడికి వెళ్ళి చదువుకో. అయినా నువ్వు హాయిగా పని చేసుకోక స్కూలెందు కోయ్" అన్నారు భావి పౌరులను తయారుచేయవలసిన ఆ మేస్టారు.

ఒక్కసారే ఎండలోంచి రూమ్‌లోకి అడుగుబెట్టిన భిక్షం కళ్ళు చీకటి ఆవహించాయి. ఉన్నట్లుండి నేలమీద పడిపోయాడు భిక్షం.

* * *

తెల్లవారింది.

భిక్షం బరువుగా కళ్ళు తెరిచేసరికి ఇంట్లో నులక మంచం మీద వున్నాడు.

"పొద్దున నేను అన్నం తినరా అని బతిమిలాడినా వినకుండా లగెత్తుకుపోయినవ్, రాత్రినుంచి సరిగదువున వుండడాన కళ్ళు తిరిగి బల్లె పడిపోయినవంట, గిదో గీ మాత్తరేసుకో" అంటూ డాక్టర్ గారిచ్చిన టాబ్లెట్ అందించింది రాజమ్మ.

టాబ్లెట్ మింగిన తరువాత "అమ్మా, నేన్నీతో పాటు పన్లె కేర్తనే, గా ఇంజనీరుగారింటికి పదు" అంటూ మంచంమీద నుంచి లేస్తూ అంటున్న భిక్షం కళ్లలో నిరాశా నిస్పృహలు కొట్టొచ్చినట్లు కనిపించాయి.

కొడుకువైపు జాలిగా చూస్తూ మసకబారిన కళ్ళు తుడుచుకుంటూ లేచింది రాజమ్మ.

కొడుకుతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గారి వరండాకి చేరింది రాజమ్మ.

స్కూలుకు వెళ్ళనని గోల పెడుతున్న పుత్ర రత్నాన్ని కొడుతూ కనిపించింది ఇంజనీర్‌గారి భార్య. వాడు ఇంకా వెళ్ళననే ఏడుస్తుండడంతో అటెండర్‌ని పిలిచి పిల్లవాణ్ణి అతనికి అప్పగించి "ఇదిగో నూట యాభయి స్కూల్లో ఫీజు కట్టు" అంటూ రెండు నోట్లు అటెండర్‌కు అందించింది.

"మమ్మీ! బడికెళ్ళనే" అంటూ ఇంకా ఏడుస్తున్న కుర్రాణ్ణి ఎత్తుకెళ్ళి బలవంతంగా జీపులో కూర్చున్నాడు అటెండరు.

డ్రైవరు జీపు ముందుకు దూకించాడు. అటెండర్ చేతిని కొరుకుతూ దిగడానికి ఇంకా విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు ఆ కుర్రాడు.

జీపు స్కూలువైపు వెళ్తానే వుంది.

అప్పటివరకు "విద్యను ఉన్నత ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం కొత్త పథకం నవోదయ పాఠశాలలు" అనే హెడ్డింగ్‌ను దినపత్రికలో చదువు తున్న ఇంజనీరుగారు, జీపు వెళ్తున్నవేపు నిర్లిప్తంగా చూస్తున్న భిక్షాన్ని పిలిచి గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ పాకెట్ తెమ్మని అయిదు రూపాయలు చేతిలో పెట్టాడు.

స్తబ్ధత నిండిన హృదయంతో పాన్ షాప్‌వైపు నడు స్తున్నాడు ఏడేళ్ళ చిన్నారి భిక్షం.